

యాత్ర

# భువి నుంచి దివికి.. భూటాన్!

**'సంవత్సరానికోసారి భూటాన్ వెళ్లగలిగిన వారు ఈ భూమ్మీద అదృష్టవంతులు' అంటారు ఓల్గా. ఆ అదృష్టాన్ని వెతుక్కుంటూ ముప్పై నుంచి అరవై అయిదేళ్ల వయసున్న మరో పదకొండుమంది మహిళలతో కలిసి వారంరోజుల భూటాన్ యాత్రకు బయల్దేరాను.**









హైదరాబాద్‌లో ఫ్లయిట్ ఎక్కి, రెండున్నర గంటల తర్వాత వెస్ట్ బెంగాల్‌లోని 'బాగ్ డోగ్రా'లో దిగి.. జీప్‌లో మూడు గంటలు ప్రయాణించాక.. ఇండియా – భూటాన్ సరిహద్దు చేరుకున్నాం. రెండుదేశాలను వేరుచేసే విభజన రేఖను చూడటం నాకిదే మొదటిసారి. నేను నిల్చున్న ఆ రెండడుగుల నేలకు.. ప్రపంచంలోనే అత్యధిక జనసాంద్రత కలిగిన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం ఒకవైపు – ప్రపంచంలోనే అతి తక్కువ జనసాంద్రత కలిగిన ఆకలీ అలజడులూ లేని చిన్నదేశం మరో వైపు ఉన్నాయన్న ఆలోచనే నాలో భావోద్వేగాన్ని కలిగించింది. బోర్డర్ మీదే 'ఆన్–అరైవల్ వీసా' తీసుకుని, ఎదురుగుండా ఉన్న పక్క దేశపు హోటల్‌కు చేరుకున్నాం. అక్కడే భోజనం చేసి నిద్రపోయాం.

### థింపూ యాత్ర

ఉదయాన్నే మా బస్ డ్రైవర్ 'సంగీ వాంగీ', టూర్ గైడ్ 'నోర్బూ' మమ్మల్ని 'కుజూ జంపోలా' (గుడ్ మార్నింగ్) అని పలకరించాక.. అందరం మినీ బస్‌లో భూటాన్ రాజధాని థింపూ బయల్దేరాం. మామూలుగా బోర్డర్ నుంచి థింపూ వెళ్లడానికి అయిదు గంటలు చాలు. కానీ, ముందురోజు వర్షానికి కొండరాళ్లు దొర్లడంతో మా ప్రయాణం మందకొడిగా సాగింది. కనుచూపుమేరా దూది పింజల్లా మేఘాలు. నిటారుగా ఆకాశాన్నంటుతున్న పొడవైన చెట్లు. నల్లటి పాము మెలికల్లాంటి తారురోడ్డు. ప్రయాణం నయన ప్రియం అయినపుడు.. కాళ్లు మాత్రం కుదురుగా ఉంటాయా! అరవైలలో ఉన్నవాళ్లు కూడా ఇరవైలలోకి దూకేశారు. పాటలు, డ్యాన్సులు, నవ్వులు, కేరింతలు. వాంగ్ వేసిన సడన్ బ్రేక్‌తో ఈలోకంలోకి వచ్చిపడ్డాం. 'ఏంటా!?' అని దిగి చూస్తే.. రోడ్డుకు అడ్డంగా పెద్దపెద్ద బండరాళ్లు. రోడ్డు 'సాఫ్' చేయడానికి చాలా టైమ్ పడుతుందన్నారు. రూటు మార్చి, బస్సు థింపూ చేరేసరికి ఇంకో రెండుగంటలు ఎక్కువ పట్టింది. అలా మొదటిరోజు మొత్తం ఒక 'రోడ్ ట్రిప్'లా ముగిసిపోయింది.

### చలో డోర్ డెన్మా..

రెండోరోజు ఉదయమే థింపూకి దక్షిణం వైపు ఉన్న బుద్ధుడి విగ్రహం 'డోర్ డెన్మా' చేరుకున్నాం. 169 అడుగుల ఎత్తుతో బంగారు పూతతో ఉన్న భారీ కంచు విగ్రహం అది. మేఘావృతమైన ఎత్తయిన కొండల మధ్య నీరెండ తాకిడికి పసిడికాంతులతో మెరిసిపోతున్న బుద్ధుణ్ని చూడటానికి రెండు కళ్లూ చాలలేదు. పాలనురగలాంటి మేఘాలు బుద్ధుణ్ని ఆలింగనం చేసుకోవడానికి చేతులు చాపుతున్నాయా? లేక ఆ బుద్ధుడే మేఘాల్లోకి చొచ్చుకుపోతున్నాడా!? అన్నట్టున్న ఆ తథాగతుడి రూపాన్ని చూసి తరించడమే తప్ప.. వర్ణించనలవి కాదు. అసంకల్పితంగా వజ్రాసనం వేసుకుని కాసేపు ధ్యానముద్రలోకి వెళ్లి పరిసరాల్ని మర్చిపోయాను. ఎవరో తట్టి లేపితే అక్కణ్నుంచి మెట్లెక్కి లోపలికి వెళ్లాను. మిరుమిట్లు గొలిపే బంగారుపూతతో